నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 30 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

## ఇక్కత్ కళ అద్భుతం


టూరిజం సెంటర్‌లో ఇంగ్లాండ్ ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 29 : పోచంపల్లి ఇక్కత్ కళ అద్భుతంగా ఉందని ఇంగ్లాండ్ దేశానికి చెందిన 6 మంది ఎన్జీఓస్ ప్రతినిధులు కొనియాడారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఎడక్షన్ నార్త్ ఈస్ట్ ఎన్జీఓ సంస్థకు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం భారతదేశ పర్యటనలో భాగంగా శుక్రవారం భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. చేనేత కార్మికుల ఇండ్లకు వెళ్లి వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. హోప్ ఎండీ రాహుల్ లూథర్, హాయన్, డానియల్, టీనా, లింజి, ప్రిన్స్ పాల్గొన్నారు.

# దీక్షా దివస్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

## ఉద్యమం నుంచి వచ్చినోళ్లను కేసులతో భయపెట్టలేరు


భువనగిరిలో దీక్షా దివస్‌లో పాల్గొన్న కార్యక్రమం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

- రాష్ట్రం రాకుంటే రేవంత్ రెడ్డి సీఎం అయ్యేవారా..?
- చంద్రబాబు చెప్పులు తుడుచుకుంటూ ఉండేవాళ్లు
- బంగారు తెలంగాణను కాంగ్రెస్ ధ్వంసం చేస్తున్నది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అండగా బీఆర్‌ఎస్ పార్టీ
- దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా బీఆర్‌ఎస్ దీక్షా దివస్
- గొంగిడి, పైళ్ల, కూసుకుంట్ల, చింతల, కంచర్ల, కల్లూరి హాజరు
- ర్యాలీలతో భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు
- నాటి కేసీఆర్ ఉద్యమ ఘట్టాలపై డాక్యుమెంటరీ ప్రదర్శన

యాదాద్రి భువనగిరి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) :'బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఉద్యమం నుంచి వచ్చినోళ్లు. కేసులకు భయపడేటోళ్లు కాదు. కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ వాళ్లు భయడపడ్తలేరని సీఎం రేవంత్ రెడ్డికి స్వయంగా డీజీపీ విన్నవించిండు. బీఆర్‌ఎస్ శ్రేణులను కేసులతో భయపెట్టలేరు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని సార్లు జైలుకు పోయొచ్చినా ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్తరు. కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసేదాకా విశ్రమించం.. బాపు దీక్షా దివస్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం..' అని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దారని, నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ధ్వంసమవుతున్నదని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ కార్నర్ వద్ద శుక్రవారం దీక్షా దివస్‌ను నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి పాదయాత్ర, బైక్ ర్యాలీలతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వేదిక వద్ద తెలంగాణ ఉద్యమ ఘట్టాలపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అంతకు ముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాడు కేసీఆర్ తెలంగాణ సాధించకుంటే.. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి అయ్యుండేవారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాకపోతే చంద్రబాబు నాయుడు చెప్పులు తుడుచుకుంటూ ఉండేవాళ్లని దుయ్యబట్టారు. ఉమ్మడి నల్లగొండలోని కాంగ్రెస్ నాయకులు ఒక్కరైనా ఉద్యమంలో ఉన్నారని అని ప్రశ్నించారు. ఇక్కడున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ ఉద్యమంలో పని చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు నాలుగేండ్లు కష్టపడితే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నేతలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు.

### ఉద్యమ స్మృతులు యువతకు తెలిపేందుకే ..

2009 డిసెంబర్ 29న కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో దీక్షకు సంకల్పించారని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. అంతకు ముందే నాలుగు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. బంగారు భవిష్యత్ రాజకీయ జీవితం ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల కోసం, ఆంధ్రా పాలకుల నుంచి విముక్తి కల్పించాలని ఒకే ఒక్కడు డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశారని చెప్పారు. నాడు చంద్రబాబు నాయకుడుకు వ్యతిరేకంగా ముందుకు వెళ్తితే భవిష్యత్ ఉండదని అంతా భయపెట్టించినా ఒక్కడుగా బయల్దేరి ఉద్యమాన్ని నడిపించారని తెలిపారు. 2004లో కాంగ్రెస్ పార్టీ, 2009 టీడీపీ నమ్మించి పొత్తుపెట్టుకొని మోసం చేశాయన్నారు. కేసీఆర్ తొమ్మిది రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే, ఆయన లాంటి నాయకుడు చనిపోతే దేశానికి మచ్చ వస్తుందని, స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ కూడా శాంతియుతంగా పోరాటం చేశారని అన్ని పార్టీలు పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసుకొచ్చాయని వివరించారు. భయపడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రకటన చేసిందన్నారు. తెల్లారే ఆంధ్రా నాయకులు ఇక్కడున్న దొంగ కాంగ్రెస్ నాయకులతో కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారని చెప్పారు. ఒక్క రోజులోనే తెలంగాణ ప్రకటనను వారి మాయ మాటలతో వెనక్కి తీసుకునేలా చేశారని వివరించారు. గ్రామ గ్రామం నుంచి కేసీఆర్ ఉద్యమాన్ని ఉధృతంగా ముందుకెళ్లి పోరాటం చేశారని చెప్పారు. 2014లో తెలంగాణను సాధించాకే రాష్ట్రంలోకి అడుగుపెట్టారని అన్నారు. యువతకు తెలియజేయడం కోసమే దీక్షా దివస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, తెలంగాణ ఉద్యమ కారులు

### రాష్ట్రం రాక్షసుల పాలైంది



బక్కపలచని వ్యక్తి కేసీఆర్ నాడు పిడికెడు మందితో బయల్దేరి రాష్ట్రాన్ని సాధించారు. నాడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు పూర్తి స్థాయి మద్దతు తెలిపారు. ఆ ఊపిరిని తీసుకొని అనేక రూపాల్లో ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ఉద్యమంలో తెలంగాణ ప్రజలను మమేకం చేస్తూ ముందుకెళ్లారు. చంద్రబాబు నాయుడును ఓడగొట్టి అధికారంలోకి రావాలంటే టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలని వైఎస్ రాజశేఖర్ రెడ్డి భావించారు. ఢిల్లీలో సోనియా గాంధీతో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. కామన్ మినిమం ప్రోగ్రాంలో పెడుతామని నమ్మితే.. వారు మోసం చేశారు. రెండేండ్లు అవకాశం ఇస్తే పట్టించుకోకపోవడంతో రాజీనామాలు చేసి బయటకు వచ్చారు. మళ్లీ ఉప ఎన్నికల్లో కరీంనగర్‌లో ప్రజలు బ్రహ్మాండంగా పట్టం కట్టారు. అయినా కాంగ్రెస్ మోసాలు చేస్తూనే వచ్చింది. తెలంగాణ ఉద్యమమే లేదని కుట్రలు చేసే ప్రయత్నం చేసింది. మన పార్టీ ఎమ్మెల్యేలను లాక్కున్నారు. కేసీఆర్‌పై అనేక బాధలు, అవమానాలు, అణగదొక్కే కుట్రలు చేశారు. అటు కాంగ్రెస్, ఇటు చంద్రబాబు కుమ్మక్కై కేసీఆర్‌ను ఇబ్బందులు పెట్టారు. అంతిమంగా కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో దీక్షకు పూనుకున్నారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. భావి తరాలకు తెలవాల్సిన ఘట్టం ఇది. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం రాక్షసుల పాలైంది. దీన్ని మళ్లీ బాగు చేసుకునే బాధ్యత మనపైనే ఉంది.

– గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

### కలిసికట్టుగా పోరాడుదాం..



చావో రేవో అంటూ కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కజేయకుండా తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు దిగారు. ఇది తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఒక చిరస్మరణీయమైన రోజు. అణిచివేతలతో ప్రజా ఉద్యమాలను అణగదొక్కలేరంటూ తెలంగాణ పోరాట వారసత్వాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పిన రోజు. దీక్షా దివస్‌ను విజయవంతం చేసేందుకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇదే స్ఫూర్తితో మన కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అందరం కలిసికట్టుగా ఉంటూ కాంగ్రెస్‌పై పోరాటం చేద్దాం. ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ఎండగడుదాం.

– పైళ్ల శేఖర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే

### దీక్షా దివస్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం..



కేసీఆర్ దీక్షా దివస్‌తోనే తెలంగాణ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఆ తర్వాత రాష్ట్రం సిద్ధించింది. కేసీఆర్ నేతృత్వంలో 10 ఏండ్లు సుభిక్షంగా ఉన్నాం. తెలంగాణ ఏర్పాటైతే ఏం చేస్తామని చెప్పామో.. అన్నీ చేసుకుంటూ వచ్చినం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలు, సబ్బండ జాతులు బాధ పడుతున్నాయి. ఏ వర్గానికి కూడా మేలు జరుగలేదు. అందరూ కేసీఆర్‌నే కోరుకుంటున్నారని సర్వేల్లో జనం చెప్తున్నరు. రేవంత్ రెడ్డి.. సోనియాగాంధీని బలి దేవత అన్నడు. ఆమె నాయకత్వంలోనే పనిచేస్తున్నా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతోనే రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారు. 14 మంది ప్రభుత్వ సలహాదారుల్లో 8మంది ఏపీకి చెందినోళ్లే ఉన్నరు. కేసీఆర్ దీక్షా దివస్ స్ఫూర్తితో మనం కూడా మరో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మరోసారి కేసీఆర్‌ను సీఎం చేసుకుందాం.

– కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే

### ఉద్యమానికి ఒక జ్వాల దీక్షా దివస్



తెలంగాణ ఉద్యమం అనేది ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. మాలాంటి యువకులను కేసీఆర్ ప్రోత్సహించడంతోనే వేలాదిగా, లక్షలాదిగా యువతరం ఉద్యమంలోకి వచ్చారు. ఆయన చేసిన దిశానిర్దేశంతో ఉడుకు రక్తమైనా శాంతియుతంగా ఉద్యమాలు చేశాం. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనో తెలంగాణ జైత్రయాత్రనో అంటూ తన చావును పణంగా పెట్టడంతో తెలంగాణ మొత్తం ఏకమైంది. ఒక ఉద్యమాన్ని ప్రారంభించి ఆ ఉద్యమాన్ని ముద్దాడే వరకు చివరి వరకు పోరాడిన తీరు.. తానే పాలించిన సందర్భం ఒక్క కేసీఆర్‌కు తప్ప మరెవరికీ లేదని చెప్పిండు.

– డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే

### పదవులను తృణప్రాయంగా వదిలారు



తెలంగాణ రాష్ట్రం కోసం నాడు కేసీఆర్‌తోపాటు ఆయన టీమ్‌లోని బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులందరూ పదవులను తృణప్రాయం గా వదిలారు. నాడు శాసన సభలో ఆంధ్రా పాలకులు టీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను ఎంతో అవహేళన చేసి నా రాష్ట్రం కోసం భరిస్తూ పోరాటం దిశగా ముం దుకు సాగారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాల మూలంగానే ఇక్కడి నుంచి పొరుగు ప్రాంతాలకు వలసలు తగ్గి పొరుగు ప్రాం తాల నుంచే ఇక్కడి వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి.

– చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే

### కేసీఆర్ గురించి యువతకు తెలియకనే ఎన్నికల్లో ఓటమి



రాబోయే రోజుల్లో నవంబర్ 29న పండుగ చేసుకోవాలి. నాడు కేసీఆర్ దీక్ష చేయకపోతే ఇయ్యాల తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేది కాదు. భారతదేశంలో తెలంగాణ తొలి స్థానంలో ఉందంటే.. దానికి కారణం కేసీఆర్. రాష్ట్రాన్ని సాధించిన నేత కేసీఆర్. ఆయన్ను గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కేసీఆర్ అకుంఠిత దీక్ష, పోరాటం నేటి యువతకు తెలియకపోవడంతో ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయాం. ఎందరో నేతలకు కేసీఆర్‌రాజకీయ అవకాశాలు కల్పించారు. వచ్చే నాలుగేండ్లు కార్యకర్తలను కాపాడుకోవాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎవరూ భయపడేది లేదు. కాంగెస్ పార్టీని ప్రజలే తిరస్కరించే పరిస్థితి వస్తుంది.

– చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

### కేసీఆర్ ఆనవాళ్లు తుడిచే దమ్ముందా..?



తెలంగాణ సిద్ధించడానికి ముఖ్య ఘట్టం నవంబర్ 29న కేసీఆర్ దీక్ష. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై తిరుగబడ్డారు. నాడు కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో తెలంగాణను సాధించుకున్నాం. కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నరు. అది జేజమ్మ వల్ల కూడా కాదు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారు. ఇంత పెద్ద ఆలయ ఆనవాళ్లు తుడిచే దమ్ముందా..? రెండు సార్లు గుట్టకు వచ్చినా ఏకాణ కూడా మంజూరు చేయలేదు. తెలంగాణ రాష్ట్రానికి స్వాతంత్ర్యం తెచ్చిన బాపు కేసీఆర్. కేటీఆర్ అరెస్టైతే విద్యార్థి, యువత, రైతులమంతా మేమే స్వచ్ఛందంగా అరెస్ట్ అవుతం. కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటే మనమే రోడ్లపై రావాలి. అన్ని వర్గాలు ఖండించాలి. అందరం యుద్ధానికి సిద్ధం కావాలి. బాపును సీఎం చేసే వరకు నిద్రపోవద్దు.

– గొంగిడి మహేందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్


### ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు..



2009 నవంబర్ 29 తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు. ఉద్యమ సమయంలో భయానక పరిస్థితులు ఉండేవి. ఉద్యమకారులను అణిచివేసే కుట్రలు చేసేవారు. కార్యక్రమం పట్టుమని 20 మంది కూడా వచ్చేది కాదు. అట్లా కేసీఆర్ ఉద్యమాన్ని ఓ రూపు తీసుకొచ్చారు. ఇప్పుడు ఒక్క పిలుపునిస్తే వేల మంది తరలివస్తున్నరు. నాడు బాపు చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించారు. కానీ కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం కాంగ్రెస్ చేతుల్లోకి వెళ్లి ఆగమైతున్నది. బంగారు తెలంగాణను బాధలను తెలంగాణగా చేస్తున్నది. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఆ దిశగా బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుకు కదలాలి.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

### మళ్లీ బాపును సీఎం చేసుకుందాం..



కేసీఆర్ సీఎం పదవి కోల్పోవడం పట్ల రాష్ట్ర ప్రజానీకం చాలా బాధ లో ఉంది. కేసీఆర్ కోసం దీక్షా వేదిక నుంచి అందరం కంకణం కట్టుకుందాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎండగడుదాం. కాంగ్రెస్ కాదని ప్రజలంతా మన కోసం ఎదురుచూస్తున్నారు. అంతా కష్టపడి బాపును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం. కేసీఆర్ హయాంలో ఎంతో అభివృద్ధి చెందిన తెలంగాణను నేడు ఆగం చేస్తుండ్రు. సోషల్ మీడియాలో పనిచేస్తున్న కేడర్‌కు అందరం అండగా నిలుద్దాం.

– కల్లూరి రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు


నల్లగొండ దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# దీక్షా దివస్ గ్రాండ్ సక్సెస్

- కదం తొక్కిన బీఆర్‌ఎస్ సైన్యం
- నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన శ్రేణులు
- గులాబీ మయంగా జిల్లా కేంద్రాలు
- దీక్షా దివస్‌లో యువత సందడి
- ధూంధాంగా కళాకారుల ఆటపాటలు
- మదిలో మెదిలిన ఉద్యమకాలం నాటి రోజులు
- భావోద్వేగానికి లోనైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉద్యమకారులు
- ఇదే స్ఫూర్తితో ప్రభుత్వాలపై పోరాటానికి సై..

నల్లగొండ ప్రతినిధి, నవంబర్29(నమస్తే తెలంగాణ) : అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ త్యాగాలను, పోరాట వ్యూహాలను, నాయకత్వ పటిమను చరిత్రలో చిరస్థాయిగా నిలుపడమే లక్ష్యంగా శుక్రవారం జిల్లా కేంద్రాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమ రోజులని తలపించేలా దీక్షా దివస్‌లు కొనసాగడం విశేషం. ఆయా జిల్లాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో గులాబీ సైన్యం, ఉద్యమకారులు, అభిమానులు ఉదయం నుంచే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాల్లో కదం తొక్కారు. దాదాపు ప్రతి గ్రామం నుంచి దీక్షా దివస్‌లో పాల్గొనేందుకు తరలిరావడం కనిపించింది. ఉద్యమ కాలంలో ఉద్యమ నేత కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఊర్లకు ఊర్లకే కదలిన మాదిరిగా నేటి దీక్షా దివస్‌లోనూ ప్రతి ఊరూ నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు కదలివచ్చారు. పెద్ద సంఖ్యలో యువతను భాగస్వామ్యం చేయాలన్న లక్ష్యంగా కూడా నెరవేరినట్లైంది. దీక్షా దివస్ ప్రాంగణాల్లోనూ యువత భారీగా సందడి చేసింది. మరోవైపు కళాకారుల ఆటపాటలు సైతం అలనాటి ధూంధాంలను తలపిస్తూ ఆ ప్రాంతాన్ని దద్దరిల్లేలా చేశారు. ఆనాటి ఉద్యమకారులు నేతల ప్రసంగాల్లో పలుమార్లు భావోద్వేగాలకు గురవుతూ కనిపించారు. కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధపడతూ ఆమరణ దీక్షకు పూనుకోవడం... కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం, కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తున్న సందర్భం.. ఇలా ఒక్కో ఘట్టాన్ని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వివరిస్తుంటే ఆ నాటి ఉద్విగ్నభరిత పరిస్థితులను తలచుకుంటూ భావోద్వేగాలతో పలువురు కంటతడి పెట్టడం అందరినీ కదిలించింది. జగదీశ్‌రెడ్డి కూడా ఒక దశలో తీవ్ర భావోద్వేగానికి గురవుతుండగా మాటలు పెకలలేదు. ఆనాటి ఉద్యమ పరిస్థితులను తలుచుకుంటూ కేసీఆర్ అకుంఠిత దీక్షను చాటి చెప్తూ భవిష్యత్తు తరాలకు రాష్ట్ర సాధన విశేషాలను, ఆనాటి పోరాట స్ఫూర్తిని రగిలించేలా దీక్షా దివస్ కొనసాగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో దివస్ జిల్లా ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ దీక్షా దివస్ ప్రాంగణాలన్నీ ప్రారంభం నుంచి ముగింపు వరకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ఉద్యమకారులతో సందడిగా మారాయి.


రామన్నపేట : పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శిరీష

## లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష

రామన్నపేట, నవంబర్29 : డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ అదాలత్‌లో అధిక కేసులను పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష ఆదేశించారు. రామన్నపేట సర్కిల్ పరిధిలోని లోకల్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకునేందుకు శుక్రవారం సీఐ, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మల్లయ్య, యుగేంధర్, డి.నాగరాజు, కృష్ణయ్య, నాగరాజు, కోర్టు సూపరింటెండెంట్ బాలగోని శివరాజ్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ ఎండీ మన్నాన్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్ పి. వెంకటేశ్, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది సాయిదీప్, అడిషనల్ కోర్టు సిబ్బంది వెంకటేశ్వర్లు, భార్గవ్ పాల్గొన్నారు.

# నార్మూల్ వెన్న చాలా చవక!

- ఎన్‌సీడీఎఫ్‌ఐ ధర రూ.385
- రూ. 340కే కిలో వెన్న విక్రయించిన నార్మూల్ సంస్థ
- ధర తగ్గించి సంస్థకు నష్టం చేస్తున్నవైనం!

యాదగిరిగుట్ట, నవంబర్29 : ఒకప్పుడు నార్మూల్ డెయిరీ లాభాల బాటలో ఉండేది. సంస్థ ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తూనే పాడి రైతులకు మేలు చేకూర్చేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. నార్మూల్ సంస్థ పాలకవర్గం, అధికారులు కమ్మకై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇతర డెయిరీ సంస్థల కంటే తక్కువ ధరకు విక్రయాలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇందుకు ఎన్‌సీడీఎఫ్ఐ ధరకు మించి తక్కువకు వెన్న విక్రయించడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లా రైతులు అధికంగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నార్మూల్ సంస్థ రోజూ లక్షా పది వేల లీటర్ల వరకు పాలు సేకరిస్తున్నది. ఈ పాలతో నెయ్యి, వెన్నతోపాటు ఇతర పాల ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తుంటారు. వెన్న విక్రయం ఒక ప్రధాన ఆదాయ వనరు. నెలకు 20 నుంచి 30 టన్నుల వెన్న ఉత్పత్తి అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్‌సీడీఎఫ్ఐ ప్రకారం విక్రయించేవారు. దాంతో ఆదాయం బాగా వచ్చేది.

### తక్కువ ధరకు వెన్న విక్రయం

గతేడాది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాలక వర్గం మారింది. నూతన పాలకవర్గం తమకు తోచిన విధంగా ధరలు ప్రకటిస్తూ విక్రయాలకు చేపడుతూ సంస్థను నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇటీవల తమిళనాడుకు చెందిన ఓ సంస్థకు కిలో రూ.340 చొప్పున సుమారుగా 50 టన్నుల వెన్నను విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. 25 టన్నుల వెన్నను ఇప్పటికే అమ్మారు. ఎన్‌సీడీఎఫ్ఐ ఈ మార్కెట్ ప్రకారం కిలో వెన్న రూ.385 ఉండగా, ఇతర సంస్థలకు భిన్నంగా నార్మూల్ రూ.45 తగ్గించి ఇవ్వడంపై పాడి రైతులు, నార్మూల్ మాజీ డైరెక్టర్లు మండిపడుతున్నారు. తక్కువ ధర విక్రయించి జేబులు నింపుకొనే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై నార్మూల్ ఎండీ బెలిదే కృష్ణను వివరణ కోరేందుకు నమస్తే తెలంగాణ ఫోన్‌లో ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

### తక్కువ ధరకు విక్రయించారో చెప్పాలి

పాల ఉత్పత్తుల్లో ప్రధానమైనవి వెన్న, నెయ్యి. ఇందులో వెన్నను ప్రతి రోజూ ఎన్‌సీడీఎఫ్ఐ చూపించిన లెక్కల ప్రకారం విక్రయించాలి. ఈ నెల వెన్న ధర కిలో రూ. 385 ఉండగా, నార్మూల్ సంస్థ మాత్రం కేవలం రూ. 340కే అమ్మింది. మిగతా రూ. 45 ఎక్కడికి వెళ్లాయో చెప్పాలి.

–లింగాల శ్రీకర్‌రెడ్డి, నార్మూల్ మాజీ చైర్మన్